1

నవతెలంగాణ

ఆదిలాబాద్

బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామానికి చెందిన రైతు కాకేర్ల ఆశన్న(43) మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆశన్న మంగళవారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి గ్రామ సమీపంలోని పొలంలో పురుగులమందు తాగాడు. పొలంలో పని చేస్తున్న పాలేరు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని చూడగా అప్పటికే మృతి చెందాడు. రైతు తనకున్న రెండెకరాల్లో ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేయగా అతివృష్టితో ఆశించిన పంట దిగుబడి రాలేదు. గతేడాది కూడా ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడం పిల్లలను చదివించడం, కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మనస్థాపం చెంది పురుగులమందు తాగాడు. భార్య సుచరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

అక్రమ నిర్మాణమైతే చర్యలు తీసుకుంటాం : కమిషనర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని దస్నాపూర్ బ్రిడ్జి సమీపంలో అక్రమ నిర్మాణమని ఫిర్యాదు వచ్చిందని, దీనిపై పూర్తి విచారణ చేపట్టి అక్రమ నిర్మాణమైతే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం స్థలాన్ని టీపీఓతో కలిసి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. యజమానితో ఫోన్లో మాట్లాడి పత్రాలను తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ దస్నాపూర్‌లో అక్రమ నిర్మాణం జరుగుతుందని కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు పరిశీలించామన్నారు. పత్రాలను పరిశీలించి అక్రమ కట్టడమైతే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.



ఎస్పీఎం..ఎవరికి ప్రయోజనం..!

- మిల్లు యాజమాన్య తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- వ్యతిరేకిస్తున్న లారీ అసోసియేషన్, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ పాలకవర్గం

సిర్పూరు పేపర్ మిల్లు వ్యవహారం రోజు రోజుకు ముదురుతోంది. ఈ మిల్లు యాజమాన్య తీరు పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నా యాజమాన్యం మాత్రం విచ్చలవిడిగా వ్యవహరిస్తూ పట్టణవాసులను తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తూనే ఉంది. ఇన్నాళ్లు చోద్యం చూస్తూ ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రస్తుతం యాజమాన్యం తీరును వ్యతిరేకిస్తూ తీసుకుంటున్న పలు నిర్ణయాలు యాజమాన్యాన్ని ఇరకాటంలో పడేస్తున్నాయి. యాజమాన్య తీరును ఎమ్మెల్యే హరీష్‌బాబుతో పాటు మున్సిపల్ పాలకవర్గం ఎండగడుతుండగా, మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం లారీ అసోసియేషన్ యాజమాన్యానికి వ్యతిరేకంగా సమ్మె చేపడుతోంది.


యాజమాన్య తీరుపై మంత్రి సీతక్కకు ఫిర్యాదు చేస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు 2018, ఆగస్టులో పున:ప్రారంభమైంది. కొత్తగా మిల్లును తీసుకున్న జేకే యాజమాన్యం తమ ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. కొన్నేళ్లుగా ప్రజలు నడిచే దారులను కూడా మూసివేసి స్థానికులను తీవ్ర ఇక్కట్లకు గురి చేసింది. అప్పట్లోనే స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైనా అప్పటి ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం చోద్యం చూడడంతో యాజమాన్యానిదే పైచేయి అయింది. ప్రస్తుతం పాలకులు మారడం, ప్రభుత్వాలు మారడంతో సీన్ రివర్స్ అయింది. కొత్తగా ఏర్పడ్డ మున్సిపల్ పాలకవర్గం ఇటీవల మున్సిపల్ సమావేశం నిర్వహించి ఈ రోడ్ల తొలగింపుకు తీర్మానం చేసింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే హరీష్‌బాబు కూడా ఈ తీర్మానాన్ని బలపర్చారు. దీంతో సోమవారం అధికారులు గోడల తొలగింపుకు శ్రీకారం చుట్టారు. ఈఎస్‌ఐ మూలమలుపు వద్ద, ఎస్పీఎం క్రీడా మైదానం వద్ద ఉన్న గోడలను జేసీబీతో తొలగించారు. కాని యాజమాన్యం కవ్వింపు చర్యలకు పాల్పడుతూ క్రీడా మైదానం ముందు తొలగించిన గోడ స్థానంలో మళ్లీ రేకులు అమర్చారు. ఆ రోడ్డు గుండా ఎవరూ నడిచేందుకు వీలు లేకుండా వీటిని ఏర్పాటు చేయడంతో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కాలుష్యంపై ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే ఫిర్యాదు

మిల్లు నుండి వెలువడే కాలుష్యంపై ఎమ్మెల్యే హరీష్ బాబు ఇప్పటికే ఢిల్లీలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మిల్లు నుండి వెలువడే కాలుష్యం వల్ల స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారని, కాలుష్య నివారణకు యాజమాన్యం జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తగా వచ్చిన యాజమాన్యం ఇప్పటికీ 250కు పైగా పర్మినెంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోలేదని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలని, కార్మికులకు కనీస సౌకర్యాలైన క్యాంటీన్ సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని తీసుకువచ్చి గేట్ మీటింగ్ నిర్వహించారు. స్థానికేతరులను తొలగించి స్థానికులను విధుల్లోకి తీసుకోవాలని, కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు ఢిల్లీకి వెళ్లి కేంద్ర కార్మికశాఖ కార్యదర్శి సునీల్ భరత్వాల్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

సమ్మె చేస్తున్న లారీ అసోసియేషన్

మిల్లులో ఉత్పత్తి అయిన పేపర్‌ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే విషయంలో రేట్ల ఖరారులో మిల్లు యాజమాన్యానికి, లారీ అసోసియేషన్‌కు మధ్య వివాదం కొనసాగుతోంది. వీరు ఈ నెల ఆరో తేదీ నుండి సమ్మె చేపడుతున్నారు. మిల్లులో ఉత్పత్తి అయిన పేపర్‌ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే లారీల రేట్లు పెంచాలని స్థానిక లారీ అసోసియేషన్ డిమాండ్ చేస్తుండగా, ఇప్పటికే తాము చెల్లిస్తున్న రేట్లు ఇతర పేపర్ మిల్లులు చెల్లించే రేట్ల కంటే అధికంగా ఉన్నాయని మిల్లు యాజమాన్యం చెబుతోంది. ఈ విషయంలో ఇప్పటికే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ సమక్షంలో చర్చలు జరిగినా ఒక కొలిక్కి రాలేదు. తమ రాష్ట్ర సంఘం సహకారంతో మిల్లుకు ముడిసరుకు తీసుకువచ్చే లారీలను కూడా ఆపేస్తామని ఇప్పటికే లారీ అసోసియేషన్ స్పష్టం చేసింది. దీని విషయంలో ఇటీవలే కాగజ్‌నగర్‌కు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు కూడా లారీ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు.


మిల్లు కాలుష్యంపై కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు (ఫైల్)


తొలగించిన గోడల స్థానంలో రేకులను అడ్డుగా ఏర్పాటు చేసిన యాజమాన్యం

తరగతిగది పైకప్పు పెచ్చు కూలి విద్యార్థికి గాయం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని గిమ్మ ఉన్నత పాఠశాలలో తరగతిగది పైకప్పు పెచ్చు కూలి విద్యార్థికి గాయమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పిప్పర్‌వాడ అభ్యుదయ పాఠశాలకు చెందిన విద్యార్థిని పడాలి అక్షయ గిమ్మ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. రెండో రోజు హిందీ పరీక్ష రాసింది. మధ్యాహ్నం 12.30గంటలకు పరీక్ష పూర్తి చేసుకుని జవాబు పత్రాలను ఇన్విజిలేటర్‌కు ఇవ్వడానికి లేవగా ఒక్కసారిగా గాలి దుమారం రావటంతో తరగతిగది పైకప్పు పెచ్చు విద్యార్థి తలపై పడింది. దీంతో విద్యార్థి తలకు గాయమైంది. రక్తం కారడంతో పాఠశాలలో ప్రథమ చికిత్స చేసి, దగ్గర్లో ఉన్న గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యురాలు సుచల గాయాన్ని పరీక్షించి మూడు కుట్లు వేసి చికిత్స చేశారు. అపాయమేమీ లేదని చెప్పడంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూడాలని విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరారు.

శనగ కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్‌రూరల్

రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన శనగల కొనుగోళ్లలో నిర్వాహకులు పారదర్శకత పాటించాలని జిల్లా సహకార అధికారి(డీసీఓ) తారమణి తెలిపారు. మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొత్తపేటశాఖ, నాఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. రైతు సమగ్ర సమాచార సర్వే నివేదిక ప్రకారం శనగలు కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతుల నాణ్యమైన సరుకు తీసుకరావాలని, శనగలకు క్వింటాల్‌కు ప్రభుత్వ మద్దతు ధర రూ.5440 చెల్లిస్తారని చెప్పారు. సరుకు నాణ్యత ప్రమాణాలు, నియమ నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని శనగలు విక్రయించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ, ఏఎంసీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

ఖైరిగూడ ఓసీని సందర్శించిన డైరెక్టర్



నవతెలంగాణ - రెబ్బెన

ఏరియాలోని ఖైరిగూడ ఓసీని మంగళవారం ఎన్‌వీకే శ్రీనివాస్(డైరెక్టర్ ఆపరేషన్, పీఏ, డబ్ల్యుపి) (ఎఫ్‌ఏసీ) ఏరియా జీఎం డి రవిప్రసాద్ సందర్శించారు. ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత, సివిల్ పనులపై సమీక్షించారు. వేస్ట్ ఫ్యూబాండ్ పాయింట్ నుండి ఖైరిగూడ ఓసీ పనిస్థలాలను వీక్షించారు. ఇన్‌ఫిట్ క్రషర్ ఖైరిగూడ ఓసీ నుండి డోర్లి వన్‌కు వెళ్లే డైవర్షన్స్ రోడ్డు, ఉల్లిపిట్ట వంతెన పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ ప్రాజెక్ట్ అధికారి ఎన్ సత్యనారాయణ, ఏజీఎం తిరుమలరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న, సివిల్ ఎస్‌ఈ భాషా, మేనేజర్ ప్రవీన్ పాంటింగ్, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, అడిషనల్ మేనేజర్ మధుసూధన్, ఈఈ సివిల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పది పరీక్షకు 46 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్ష మంగళవారం రెండవ రోజు ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 10,407 మంది విద్యార్థులకుగాను 10,359 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత వెల్లడించారు. 46 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- పరీక్షా కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

పది పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. డెలివరి రూమ్, ల్యాబ్, ఓపి రూం, బర్త్ వెయిటింగ్ రూమ్‌లను పరిశీలించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం, కేజీబీవీ విద్యార్థులను ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు డెలివరీకి సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రిలో నిర్వహించే చికిత్సల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

రోజువారి వచ్చే రోగుల నమోదు, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్, వైద్యులు భీంరావ్, శిల్పా పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

సెక్టోరల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులకు మంగళవారం శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఎస్పీతో కలిసి పాల్గొన్నారు. సెక్టోరల్ అధికారులు అన్ని అంశాలలో క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవీఎంలు వివిధ పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన పూర్తి పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని తెలిపారు. సెక్టోరల్ ఆఫీసర్, రిటర్నింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలు ఏ విధంగా నిర్వహించారో అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికలు కూడా అదే విధంగా నిర్వహించాలని తెలిపారు. అన్ని అంశాలపై ట్రైనర్ లక్ష్మణ్ అవగాహన కల్పించారు.



రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళన తీవ్రతరం

- లారీ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్‌బాబు


మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పేపర్ రవాణా విషయంలో సిర్పూరు పేపర్ మిల్లుతో ఏర్పడ్డ సమస్యను రెండు రోజులలో పరిష్కరించని పక్షంలో తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వి కిషోర్‌బాబు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సమ్మె చేపట్టి 14 రోజులు అయిందని, ఇప్పటి వరకు కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎస్పీ సమక్షంలో చర్చలు జరిగినా ఒక కొలిక్కి రాలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అండతోనే మిల్లు యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని అన్నారు. వేలాది కోట్ల ప్రజాధనాన్ని సబ్సిడీ రూపేణా మిల్లుకు అందిస్తే, యాజమాన్యం మాత్రం ఉపాధి కల్పనలో స్థానికులను కాకుండా స్థానికేతరులకు ప్రాధాన్యత ఇస్తూ నిరుద్యోగులను మోసం చేస్తోందని తెలిపారు. ఉత్పత్తి ఆధారంగా స్థానిక లారీ అసోసియేషన్‌కు లోడింగ్ ఇస్తామని చెప్పిన యాజమాన్యం ఇప్పుడు దాటవేత ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా మిల్లుకు సంబంధించిన లారీలు ఓవర్‌లోడ్‌తో వస్తున్నాయని, దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు చెడిపోతున్నాయని అన్నారు. ఈ విషయమై మంగళవారం జిల్లా రవాణాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుండి మిల్లుకు ముడిసరుకు తీసుకువచ్చే వాహనాల డ్రైవర్లకు మిల్లులో కనీసం క్యాంటీన్ సౌకర్యం కూడా లేదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మిల్లు యాజమాన్యం ముందుకు పోతోందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తమ అసోసియేషన్ రాష్ట్ర సంఘానికి సమాచారం ఇచ్చామని, ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో బయటి నుండి వచ్చే లారీలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నిజాముద్దీన్‌తో పాటు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కడెం

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కుడిమేత అమృత రావు అనే క్యాన్సర్ వ్యాధి బాధితునికి హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ గ్రూప్ ఆర్థిక సాయం అందించింది. మంగళవారం బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించి, రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు వర్దిల్లి మహేష్, తోంటికూరి మణికంఠ, మాజీ గ్రామ సర్పంచ్ బాదురావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మా పరమేశ్వర్ పాల్గొన్నారు.



ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన జాదవ్ గణేష్ ఐదు నెలల క్రితం మృతి చెందాడు. కూతురు పెండ్లి దగ్గర పడటంతో పెండ్లి ఖర్చుల నిమిత్తం గ్రామ సంత్ సేవాలాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఉద్యోగ సంఘాల నాయకులు చౌహాన్ కిషోర్, జాదవ్ పరశురాం, చౌహాన్ పునిరాం, జాదవ్ ఆనంద్ రావ్, రాథోడ్ గణేష్, రాథోడ్ తానాజి, దినేష్, రోహిదాస్ ఉన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల బలోపేతం చేయడానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలకు భాగస్వాములు చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేస్తుంది. అందులో భాగంగానే మంగళవారం మండలంలోని రుయ్యాడి యూపీఎస్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలుగా నక్క లక్ష్మిని, విద్యార్థుల తల్లిదండ్రుల సమీక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింలు, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు నెట్టెడి గంగాధర్, గ్రామస్తులు నిమ్మల సుదర్శన్‌రెడ్డి, జువ్వాక నర్సింలు, ధనుంజయ్, రమకాంత్, కొప్పుల గంగన్న, రాజు, చిట్యాల మహేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు పాల్గొన్నారు.

తాంసి వార్డెన్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

- ఐటీడీఏ పీఓకు విద్యార్థి సంఘాల వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తాంసి ఆశ్రమ హైస్కూల్ వార్డెన్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో పీఓకు జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. సందర్శనకు వచ్చిన సమయంలో వార్డెన్ తన ఐదు నెలల బాబుకి పాలివ్వడానికి వెళ్లిందన్నారు. ఈ విషయంలో మానవీయ కోణంలో ఆలోచించి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మడావి గణేష్, సలాం వరుణ్, గేడం కేశవ్, నరేందర్, రమేష్, సునీల్, కార్తిక్, రాజు యాదవ్, ప్రకాష్ పాల్గొన్నారు

సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థులకు మూడు రోజుల శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో టాస్క్ వారి సౌజన్యంతో 21వ శతాబ్దపు బదిలీ చేయగల నైపుణ్యాలపై విద్యార్థులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. 21వ శతాబ్దంలో విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రావీణ్యత పొందటం అత్యంత ప్రధానమైనదని వివరించారు. ఈ శిక్షణ మూడు రోజుల పాటు ఉంటుందని తెలిపారు. ఈ విలువైన శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డా.ఎం.నర్సింగ రావు, ఎండీ. ఇమ్రాన్ అలీ, టాస్క్ శిక్షకుడు పి.రామ మనోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

వేసవిలో పశువులకు చర్మవ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా ఉచిత గాలికుంటు నివారణ టీకాలను ఆవులకు, గేదెలకు, ఎద్దులకు తప్పకుండా వేయించాలని మండల పశు వైద్య అధికారి డాక్టర్ గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 150 ఆవులకు, 190 గేదెలకు, 120ఎద్దులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శేఖర్, దేవురావు, పశువుల యజమానులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఐదుగురు గైర్హాజరు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన పరీక్షలో ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు రావడంతో పరిసర ప్రాంతాలు కిటికీటలాడాయి. హాల్ టికెట్ల ఆధారంగా విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు.

గ్రేహౌండ్స్ శిక్షణతో ఉపయోగం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా పోలీసులకు గ్రేహౌండ్స్ శిక్షణ ఎంతో ఉపయోపడుతుందని ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. పోలీస్ సిబ్బందికి వారం రోజుల గ్రేహౌండ్స్ ప్రత్యేక శిక్షణను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది శారీరక ధారుఢ్యం, మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా కోసం ఈ ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు మెలకువలు నేర్చుకోవడానికి మంచి అవకాశమన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, చెక్‌పోస్టుల వద్ద డ్యూటీలు, వాహనాల ముమ్మర తనిఖీ, ఇతర పోలీస్ సంబంధిత విధుల నిర్వహణకు ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐలు రామ్ నిరంజన్, శైలందర్, రామకృష్ణ, ఆర్ఎస్సైలు వినోద్, సాయికృష్ణ, రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్ఎఫ్ నాయకులకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తెలంగాణ స్టూడెంట్ ఫోరం(టీఎస్ఎఫ్) నాయకులను తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం మావల మండలంలోని కుమురం భీం కాలనీలో టీఎస్ఎఫ్ నాయకులను శాలువతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం అమలు, కామన్ స్కూల్ విద్యా విధానం కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలతో పాటు సామాజిక సమస్యలపై కూడా పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, రాణి దుర్గవతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు గొడం జంగు బాయి, సోయం లలిత, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాహుల్, ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ఇష్తేఖర్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, ఆత్రం గణపతి, వెడ్మ ముకుందరావు, శాంత బాయి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(బి), పల్లి(కె), బరంపూర్ గ్రామంలో సోమవారం కురిసిన వడగండ్ల వానకు పంటలు దెబ్బ తిన్న రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. మంగళవారం వడగండ్ల వానకు పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. రైతులకు తక్షణమే ఎకరాకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించాలని అన్నారు. అతివృష్టి అనావృష్టితో ప్రతి ఏటా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, జిల్లా నాయకులు వసంత్‌రెడ్డి, ఏఈఓ సౌమ్య రైతులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, రైతులు

మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ప్రారంభించారు. మంగళవారం జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీలో టీవీలను, సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు డీపీఆర్వో ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ఏర్పాటు ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, పత్రికల్లో ప్రచురించిన రాజకీయ ప్రకటనలు అభ్యర్థి ఎన్నికల వ్యయంలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. శాటిలైట్ ఛానల్‌లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, ఈ పేపర్ లో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా రాజకీయ ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైని కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా పౌర సంబంధాల అధికారిణి తిరుమల, ఈడీఎం రవీందర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్

నవతెలంగాణ-కుభీర్

రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెల్పించేలా నియోజకవర్గంలో ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్ రావు పటేల్ అన్నారు. మంగళవారం భైంసాలోని ఆయన నివాసంలో కుభీర్ మండలంలోని పల్సి సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ కొట్టే హనుమల్లు, గంగాధర్‌తో పాటు పార్డి(బి) గ్రామానికి చెందిన గుడాల రాజలింగ్, శేరి భోజన్న, దిగంబర్, గంగాధర్, సాయినాథ్, శైలన్‌తో పాటు మరి కొంత మంది సీనియర్ నాయకులు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడిని భారీ మెజార్టీతో గెలిపించి ముధోల్ నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అదే విదంగా గ్రామంలో ఉన్న పేద మధ్య తరగతి ప్రజలకు కాంగ్రెస్ చేపట్టిన ప్రతి ఒక పథకాలను అందించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికలో ఇచ్చిన ఆరు గ్యారెంటిలను పక్కాగా అమలు చేసి, ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ చంద్రే, బంక బాబు, సిద్ధం వివేకానంద, సాయబ్ రావు, జేడీ రామ్ పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

రైతులకు నష్టపరిహారం అందించాలి

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(బి), పల్లి(కె), బరంపూర్ గ్రామాల్లో కురిసిన ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషాని కలిసి విన్నవించారు. అంతకు ముందు నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. మండలంలో 1200 ఎకరాల మొక్కజొన్న, పొగాకు, జొన్న పంటలు నేల మట్టం కావడంతో పంటలను పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి నష్టపోయిన రైతుల పంటలను సర్వే చేయించి నష్టపరిహారాన్ని అందించాలని అన్నారు. పంటలను పరిశీలించిన వారిలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు రాజేశ్వర్, డీఏఓ పుల్లయ్య, ఏఓ మహేందర్, ఏఈఓ శ్రావ్య, ఎంపీటీసీ సోమన్న, వెంకన్న యాదవ్, రైతులు విఠల్, గంగన్న, లింగారెడ్డి, సంజీవ్, నర్సిములు, వంశీ, గ్రామస్తులు ఉన్నారు.



కళాకారులకు తన వంతు సహకారం అందిస్తా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ కళాకారుల్లో నైపుణ్యలున్న అవకాశాలు లేక ముందుకు సాగలేకపోతున్నారని, వారికి తనవంతుగా పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆర్ఎస్ 38 ర్యాపర్స్ ఆధ్వర్యంలో చిత్రీకరించిన ఆదిలాబాద్ డాన్ షార్ట్ ఫిలీంను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మంగళవారం కళాకారులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి లఘు చిత్రాన్ని విడుదల చేయించారు. ఆదిలాబాద్ కళాకారుల్లో అనేక నైపుణ్యాలున్నాయని, సరైన ప్రోత్సహం లేక ఇక్కడే ఆగిపోతున్నారని ఎమ్మెల్యే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత సినిమాటోగ్రాఫికి వీరిని పరిచయం చేసేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. అదే విధంగా ఆదిలాబాద్ కళాకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కార్యక్రమాలు చేపట్టేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం రేవంత్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సౌకర్యాలు లేకున్నా షార్ట్ ఫిలింలు తీస్తు అబ్బుర పరస్తున్నారన్నారు. వారికి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గణేష్, దాసన్న, శంకర్ పాల్గొన్నారు.

అభ్యర్థి విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

- కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మెన్ గోవింద్ నాయక్



నవతెలంగాణ-ఖానాపూర్

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ ఎస్టీ సెల్ చైర్మెన్ బాణావత్ గోవింద్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్ఠానం ఎవరిని ప్రకటించిన వారి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో ఈ సారి కాంగ్రెస్ అధికారంలోకి రానుందానీ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లోనే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాసమోళ్ల అశోక్, మైనారిటీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ షౌకత్ పాషా, షేక్ శమి ఉన్నారు

మోకాళ్ల అరుగుదలతో అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మోకాళ్ల అరుగుదల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు అప్రమత్తంగా ఉండాలని యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ సునీల్ దాచెపెల్లి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మోకాళ్ల మార్పిడి, రోబోటిక్ సర్జన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోకాళ్ల అరుగుదల సమస్యలతో బాధపడుతున్న వారు మొదటి, రెండు దశల్లో ఉంటే ఇంజక్షన్‌తో నయం చేసుకోవచ్చున్నారు. నాలుగో దశలో ఉంటే తప్పనిసరిగా సర్జరీ చేయించుకోవాలని సూచించారు. రోబోటిక్ ద్వారా ఆపరేషన్ చేసిన కొన్ని గంటల్లోనే నడిచే అవకాశం ఉంటుందన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో త్వరలో ఉచిత శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నవారు స్టెరాయిడ్, పెయిన్ కిల్లర్ తీసుకోవడంతో కిడ్నీలు దెబ్బతింటాయని తెలిపారు. రోబోటిక్ విధానం, మోకాళ్ల నొప్పులకు సంబంధించి తదితర విషయాలను తెలియజేశారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి



నవతెలంగాణ-నార్నూర్

మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థిక అభివృద్ధి చేందాలని ఏపీఎం మైస రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న 43 మంది మహిళలకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. శిక్షణను పూర్తి చేసుకున్న వారికి అభినందనలు తెలిపారు. ప్రస్తుత కాలంలో మగ్గం వర్క్‌కు చాలా డిమాండ్ ఉందని, మహిళలు స్వయం ఉపాధి పొంది కుటుంబానికి ఆసరాగా నిలవాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో కుట్టు మిషన్ వచ్చిన వారికీ స్కూల్ యూనిఫాం కుట్టేందుకు అవకాశం కలిపిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు కాంబ్లే సంతోష్, రాథోడ్ సంతోష్, జాదవ్ కిషన్ రావ్, రెవయ్య, శ్రీరాం, సత్యశీల, సిబ్బంది చౌహాన్ తుకారాం పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రస్తుతం సమాజంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయని దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ సైదారావు అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆడపిల్లలపై ఆగయిత్యాలు, బాల్య వివాహాలపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి, షీటీమ్ ఎస్సై సుమలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సౌకర్యార్థం రోడ్డు

నవతెలంగాణ-ఉట్నూర్

రైతుల సౌకర్యార్థం రోడ్డు వేస్తున్నామని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్ అన్నారు. మంగళవారం మండలంలోని శ్యాంపూర్ నుంచి చెరువు వరకు ఆర్అండ్‌బీ నిర్మించనున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగోజీ తండ గ్రామపంచాయతీలోని వ్యవసాయ సాగు చేయడానికి వేళ్లే రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వారి ఇబ్బందులను తొలగించడానికి శ్యాంపూర్ రోడ్డు నుంచి చెరువు వరకు రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వాగ్మారే జగ్జీవన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కందుకూరి రమేష్, వైస్ ఎంపీపీ దవులే బాలాజీ, మాజీ సర్పంచ్లు హరినాయక్, జమున నాయక్, ఎంపీటీసీ జాదవ్ గోపాల్ రావు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నమోదు చేయాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



ఎరువుల దుకాణాల్లో రికార్డులను ఎప్పటికప్పుడు నిల్వలను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఏపీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు జరపాలని, గోదాంలో నిల్వలు, ఏపీఓఎస్ మిషన్‌లో నిల్వలు ఖచ్చితంగా ఉండాలన్నారు. రైతులు తప్పనిసరిగా ఎరువుల దుకాణాల్లో రశీదులు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రాజులనాయుడు పాల్గొన్నారు.

బొగ్గుగని కార్మిక సంఘానికి సదాశివ్ రాజీనామా

నవతెలంగాణ-రెబ్బెన

బొగ్గుగని కార్మిక సంఘానికి రాజీనామా చేస్తున్నట్టు టీబీజీకేయస్ మాజీ ఉపాధ్యక్షుడు నలగొండ సదాశివ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వార్ధం కోసం కొంతమంది రాజకీయ నాయకులు సంఘాన్నీ నిర్వీర్యం చేస్తూ సంఘాన్ని తాకట్టు పెట్టి మరొక సంఘానికి మద్దతు తెలిపారన్నారు. 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో ఎంతో కష్టపడి పాల్గొన్నానని, కార్మికుల హక్కులను కాపాడడం కోసం ఉద్యమాలు చేశానని ఆయన తెలిపారు. కొంతమంది నాయకులు సంఘంలోకి వచ్చి టీబీజీకేయస్ సంఘాన్ని స్వార్థం కోసం తాకట్టుపెట్టారని, ఇది తనకు నచ్చక కార్మిక సంఘానికి రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు.

పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపై ఉంటుందని దీని కోసం, కేంద్రాల పరిధిలోని పిల్లల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్, ఆర్‌ఆర్ కాలనీలో గల ఆదర్శ అంగన్‌వాడి కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి అంగన్‌వాడి కేంద్రం పరిసరాలు, గదులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడి అధికారులు, సిబ్బంది తమ కేంద్రం పరిధిలోని పిల్లల బరువు, ఎదుగుదల, మానసిక పరిస్థితులపై పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన పోషకాహారాన్ని సకాలంలో అందించాలన్నారు. కేంద్రం పరిధిలో గర్భం దాల్చిన మహిళలకు తమ వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, ఆస్పత్రులలోనే ప్రసవాలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడి టీచర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సకాలంలో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ భాస్కర్, సంబంధిత అధికారులు, అంగన్‌వాడి కేంద్రం టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనపై అధికారులు అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల బాల రక్షాభవన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు బాల్య వివాహాలు జరుగుతున్నట్లుగా తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాలల సంరక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఏర్పాటు చేయడం జరిగిందని, ఫిర్యాదులు, సమాచారం అందించేందుకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామ, మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాలల హక్కుల చట్టం ప్రకారం బాల కార్మికులను పనిలో ఉంచితే సంబంధిత సంస్థల యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా బాలరక్ష భవన్ ద్వారా నిర్వహించే విధులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీసీపీఓ మహేష్, బాల రక్ష భవన్ సిబ్బంది పాల్గొన్నారు.



సఖి సెంటర్‌లో కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది



బాల్య వివాహాల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్

బాధిత మహిళలకు సఖి కేంద్రంలో ఆశ్రయం

లైంగిక వేధింపులు, గృహహింస, ఈవ్ టీజింగ్ బాధిత బాలికలు, యువతులు, మహిళలకు సఖి కేంద్రంలో ఆశ్రయం కల్పించి అవసరమైన న్యాయ సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధిత మహిళలకు సఖి కేంద్రంలో ఆశ్రయం కల్పించి అవసరమైన సేవలు అందించడం జరుగుతుందని, సఖి కేంద్రంలో న్యాయ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో మహిళలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి కౌన్సిలింగ్ అందించి మహిళలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. సిబ్బంది ఆ దిశగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ భాస్కర్, సఖి కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పౌర సంబంధాల అధికారి వై.సంపత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున విధులు కేటాయించిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1950తో పాటు మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫోన్ నం.08733-279033లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా సెంటర్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఘనంగా పోషణ పక్షోత్సవాలు



నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని సోమిని గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు చేశారు. మొగవెల్లి, ఇప్పలగూడ, తలాయి, సోమిని అంగన్‌వాడీ సెంటర్‌లలో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ప్రీ స్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిరుధాన్యాల వాడకంతో గర్భిణీలకు రక్తహీనత నుండి కాపాడవచ్చని తెలిపారు. గర్భిణీలు ఎక్కువ పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల ఎదుగుదలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. చిరుధాన్యాల్లో దొరికే పోషక విలువల గురించి వివరించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పసుపు, కుంకుమ, సారె అన్నీ అందించి ఘనంగా సీమంతాలను చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరుణ, అంగన్‌వాడీ టీచర్లు రమాశ్రీ, స్వప్న, శారద, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



నవతెలంగాణ-కౌటాల

పశువులకు రైతులు వ్యాధి నిరోధిక టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఎలాంటి వ్యాధులు సోకిన తమకు సమాచారం అందించాలన్నారు. ఇంటికొచ్చి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ఈ శిబిరం మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చేనెల 15 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట పశు వైద్య సిబ్బంది భిక్షపతి, రాజన్న, ప్రశాంత్, శోభన్ ఉన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో పశు వైద్యాధికారి రాకేష్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఉచితంగా వచ్చిన టీకాలను పశు పోషకలు పశువులకు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి సురేష్, సిబ్బంది శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన, కోమటిగూడ, కొత్తదుబ్బగూడ, కన్నర్‌గావ్ గ్రామాల్లో కుష్టువ్యాధిపై సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించామని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. దుబ్బగూడ గ్రామంలోని పాఠశాలలో కుష్టువ్యాధిపై పిల్లలకు కూడా అవగాహన కల్పించి లక్షణాల గురించి తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, రేణుక, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నవతెలంగాణ-వాంకిడి

మహారాష్ట్ర నుండి ఆర్టీసీ బస్సులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి వాంకిడి పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కోట మహేష్ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన దిలీప్ యాదవ్ నుండి రూ.10 వేలు చెల్లించి కిలో గంజాయి కొనుగోలు చేశాడు. వాంకిడి బస్టాండు వద్ద రాత్రి బ్యాగు పట్టుకొని అనుమానంగా కనిపించడంతో కోట మహేష్‌ను పోలీసులు తనిఖీ చేయగా కిలో గంజాయి లభించింది. అతన్ని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. మహేష్, దిలీప్ యాదవ్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మండల ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కమాన గ్రామంలో జరిగింది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కమాన గ్రామానికి చెందిన పిప్రె శంకర్(42) మూడు సంవత్సరాల నుండి కడుపునొప్పితో బాధపడుతూ భరించలేక మద్యానికి అలవాటు పడ్డాడు. ప్రతిసారి కడుపునొప్పి వచ్చినప్పుడల్లా మద్యం తాగేవాడు. దీంతో అతని భార్య పిప్రె సునీత కడుపునొప్పి వస్తే ఆస్పత్రికి వెళ్లాలి ఇలా మద్యం తాగుతుంటే కడుపునొప్పి తగ్గుతుందా అని మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరికి చెప్పకుండా సోమవారం రాత్రి ఏడు గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మళ్లీ భార్య సునీత ఎందుకు మద్యం తాగివచ్చావని, మద్యం తాగడం మానేయాలని మందలించడంతో ఇంటి నుండి కోపంతో శంకర్ బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 10 గంటలైన ఇంటికి తిరిగి రాకపోవడంతో పెద్ద కుమారుడు సాయి, చిన్న కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి చుట్టుప్రక్కల, బంధువుల ఇంటిలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ శంకర్ పురుగులమందు తాగి చనిపోయాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పిప్రె శంకర్ కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై రాములు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీం వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, లేదంటే నిరవధిక సమ్మె సిద్ధమవుతామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. స్కీం వర్కర్లతో కలిసి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పెండింగ్ వేతనాలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కీంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి పెండింగులో ఉన్న 3 నెలల వేతనాలు, 7 నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. మూడు నెలల వేతనాలు, పీఆర్సీ ఏరియర్స్ ఏడు నెలల డబ్బులు చెల్లించాలని అనేక రోజుల నుంచి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతోనే కార్మికులకు వేతనాలు అందించడం లేదన్నారు. ఈ స్కీంలో దాదాపు 78 క్యాడర్లలలో సుమారు 17,514 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే వేతనాలు చెల్లించకుంటే ఈ నెల 22 నుండి నోవర్క్ నోపే విధానం అమలైన సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో 2వ ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంతోషి, కోశాధికారి సునీత, ఎన్‌హెచ్‌ఎం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షకీల్, కార్యదర్శి వెంకటేష్, నాయకులు మమత, ప్రశాంత్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన : తెలంగాణ రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రావాల్సిన మూడు నెలల వేతనాలు, ఏడు నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 22 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెబ్బెన సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ గత మూడు నెలల వేతనాలు, పీఆర్సీ ఏరియర్స్ ఏడు నెలల డబ్బులు చెల్లించాలని అనేక రోజుల నుండి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రమీళ, ఎన్‌హెచ్‌ఎం డాక్టర్ సుప్రియ, సిబ్బంది రేణుక, జాన్సీ, సరిత, విజయలక్ష్మి, మండల్ పాల్గొన్నారు.



రెబ్బెనలో మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఉద్యోగులు

పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న 10వ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాటు చేశామన్నారు. 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ఫ్లయింగ్ స్క్వాడ్, మొబైల్స్ బృందాలతో పరీక్షలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు స్వేచ్ఛ వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా ఇన్విజిలేటర్లు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేతతో పాటు పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్స్ నిషేధం ఉంటుందన్నారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్స కిట్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

రెండో రోజు ముగిసిన పరీక్షలు

పదో తరగతి పరీక్షలు రెండో రోజు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసాయి. మొదటి రోజు ఇద్దరు విద్యార్థులు డిబార్, ఇద్దరు ఇన్విజిలేటర్లను విధులనుండి తొలగించగా రెండవ రోజు అటువంటి కేసులు నమోదు కాలేదు. జిల్లా విద్యాధికారి అశోక్ వాంకిడి పరీక్ష కేంద్రాలు తనిఖీ చేయగా ఆర్జెడి అబ్జర్వర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు జిల్లా పరీక్షల సంచాలకుడు ఉదయ బాబు తీర్యాని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తోటను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సోనాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం తోటను కుమురం భీం కలెక్టర్ వెంకటేశ్ దోత్రె మంగళవారం పరిశీలించారు. తోటలో పండిస్తున్న కూరగాయలను పరిశీలించి అభినందించారు. వీటితో పాటు పండ్ల చెట్లను కూడా పెంచాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ప్రతిరోజు పిల్లలకు పౌష్టికాహారం ఏమేమి ఇస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలకు నిత్యం పౌష్టికాహారం అందించడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. ప్రక్కనే గల పాఠశాలకు వెళ్లి విద్యార్థులను చదువు ఎలా చెపుతున్నారని, విద్యార్థుల పేర్లు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడంతో పాటు పేద విద్యార్థులకు నాణ్యమైన బోధనలు అందించాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. అక్కడ విద్యుత్ సరిగా లేకపోవడంతో విద్యుత్ ఏర్పాటు చేయాలని స్థానికులకు సూచించారు. మధ్యమార్గంలో చెక్‌పోస్టు వద్ద ఆగి ప్రతిరోజు వాహనాల తనిఖీ, పోలీసుల విధుల గురించి తెలుసుకున్నారు. రోజు వచ్చే వాహనాల గురించి విచారించారు. ఎన్నికలు అయ్యే వరకు గట్టి నిఘా ఏర్పాటుచేసి ప్రతిరోజు సక్రమంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా వారి వెంట ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 50 వేల కంటే అధికంగా తీసుకెళ్లొద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పార్టీల నాయకులు నియమావళికి సహకారం అందించాలని కోరారు. చెక్‌పోస్టు నుంచి ఏ ఒక్క వాహనం తప్పికోకుండా తనిఖీలు చేయాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ రోహిత్, సీడీపీఓ రెబిక, రెవెన్యూ సిబ్బంది అధికారులు, స్థానికులు ఉన్నారు.



అంగన్‌వాడీ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పేదలకు సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలి

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలో పేదలకు సక్రమంగా డీలర్లు బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ భువనేశ్వర్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్‌కార్డు దారులందరికి ఉచిత బియ్యం తప్పనిసరిగా అందజేయాలని, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, రేషన్ దుకాణాల్లో బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు అచ్చుతరావు, సంతోష్, డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అరటిపండ్లు పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అనంతరం అరటిపండ్లు మండల జాగృతి మాజీ కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అందజేశారు. విద్యార్థులకు బలం చేకూరాలను ఉద్దేశ్యంతో పండ్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, మాజీ ఉప సర్పంచ్ రమేష్, నాయకులు తిరుపతి, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై సమీక్ష

నవతెలంగాణ-నస్పూర్



లోకసభ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, నస్పూర్ ఎస్ఐ రవికుమార్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి రావడంతోదానిని ఉల్లంఘించకుండా పట్టణంలో ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉంచరాదని, రసీదు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకెళ్లకూడదని, అలాగే నస్పూర్ పట్టణ ఓటర్లకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

పూడికతీతతో కాలనీ వాసులు హర్షం

నవతెలంగాణ-మందమర్రి



పూడిక తీత పనులపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదేశాలతో మంగళవారం కాలువలలో పూడిక తీత, రోడ్డుకు ఇరువైపులున్న ముళ్ల పొదలను, చెత్త కుప్పలను తొలగించారు. గాంధీనగర్‌లో గత కొన్ని నెలలుగా కాలువలలో పేరుకుపోయిన మురుగు నీటితో కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించిన కాంగ్రెస్ యువ నాయకులు ఎండీ జావిద్ ఖాన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కమిషనర్ పరిసరాలను సందర్శించి వెంటనే మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి శుభ్రం చేపించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

● ఒకదానికి ఒకటి ఢీకొన్న నాలుగు వాహనాలు



నవతెలంగాణ-హాజీపూర్

మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే కోటపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి ముళ్ళ శేఖర్ అతని భార్య, అమ్మానాన్న, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో(టీఎస్ 01 బీ 7001) పాటు వేమనపల్లి గ్రామానికి చెందిన మరో టాటా ఏసీ(ఏపీ 28 టీవీ 2311)లో మూడు కుటుంబాలు మొత్తం 16 మంది కొండగట్టు దర్శనం చేసుకొని వస్తున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రెండు వాహనాలకు ఎదురుగా లక్షెట్టిపేట మండలం గుల్లకోట గ్రామానికి చెందిన బులోరా(టీఎస్ 19 టీప 5040) వాహనం ఢీకొట్టింది. శ్రీరాంపూర్‌లోని అల్లూరి సీతారాంనగర్‌కు చెందిన బాకం రవి మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి లక్షెట్టిపేట్‌కు వస్తున్న టాటా ఇంట్రోతో వాహనాలను డీకొట్టాడు. దింతో బాకం రవికి కాలుకు భుజానికి బలమైన గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ గోపతి సురేష్‌లు గాయాలపాలైన నలుగురిని ఆస్పత్రికి తరలించారు.

చార్జిషీట్ సస్పెన్షన్ రద్దు చేయాలని



నవతెలంగాణ-మందమర్రి

అధికారులకు ఇచ్చిన చార్జిషీట్ సస్పెన్షన్ రద్దు చేయాలని మంగళవారం సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఏరియా జీఎం మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. మందమర్రి వర్క్ షాప్‌లో మార్చి 16న కర్రె రాజు జనరల్ మజ్దూర్ ప్రమాదవశాత్తు మరణించారు. జరిగిన సంఘటన పట్ల సీఎంఓఏఐ సంఘం అధికారులు విచారం వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి యాజమాన్యం ఇద్దరు అధికారులపై 18వ తేదిన చార్జిషీట్ సస్పెన్షన్ ఇచ్చింది. సంఘటనకు సంబంధించి డీఎంఎస్ అధికారుల విచారణ పురోగతిలో ఉండగా వాస్తవాలు పూర్తిగా బయటకు రాకుండానే అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవడం బాధాకరమన్నారు. ఉత్పత్తి రక్షణలో నిత్యం ముందుండి నడిపించే అధికారులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం మూలాన వారి మనోభావాలను దెబ్బతీసినట్లు అవుతుందన్నారు. ఇచ్చిన చార్జిషీట్ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని మెమోరాండంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఐడీ డీజీఎం రాజన్న, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, శాంతిఖని ఏజెంట్ విజయ ప్రసాద్, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు ఎస్.రమేష్, సెక్రటరీ పైడిశ్వర్ పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రంలో భయాందోళన గురి కావద్దు

● జైపూర్ ఎంపీడీవో సత్యనారాయణగౌడ్

నవతెలంగాణ-జైపూర్

పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో భయాందోళన గురికాకుండా జాగ్రత్త పడాలని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను క్రమ పద్ధతిలో చదువుకోవాలని పరీక్షా కేంద్రంలో సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో ప్రశ్నలకు జవాబులు రాసిన తరువాత చివరిగా మరోసారి చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా జవాబు పత్రాలు తప్పులు కొట్టివేతలు లేకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న తీరును పర్యవేక్షించారు.


పాత కక్షలతో వ్యక్తిపై దాడి

నవతెలంగాణ-జన్నారం

పాత కక్షలు మనసులో పెట్టుకుని మడల కేంద్రంలో ఒకరిపై దాడి జరిగిందని ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన మారాజు అంజన్న సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళు తున్న క్రమంలో శ్రీలంక కాలనీకి చెందిన కాంబ్లే రాజు అతని కుమారుడు ఓంకార్, దత్తు మరికొంత మంది కలిసి గాంధీనగర్ రాజరాజేశ్వర పాత స్కూల్ వద కర్రలతో, చేతులతో దాడి చేశారు. తలకి తీవ్రంగా గాయమై రక్త స్రావం అయింది. బాధితుడు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖాళీ అవుతున్న కారు..!

● బీఆర్ఎస్‌ను వీడుతున్న నాయకులు
● కాంగ్రెస్, బీజేపీలో భారీగా చేరికలు
● ఎమ్మెల్యే వివేక్‌తో కలిసొస్తున్న మాజీలు



నవతెలంగాణ-జైపూర్

శాసనసభ ఎన్నికల అనంతరం ఉమ్మడి మండలంలో భారత రాష్ట్ర సమితి పార్టీ కాళీ కాబోతుంది. తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు సోమవారం గోదావరిఖనిలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసి మంతనాలు జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. నాయకుల చేరిక పట్ల ఎమ్మెల్యే వివేక్ సముఖంగా ఉన్నప్పటికీ స్థానిక నాయకులతో విభేదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. శాసన సభ ఎన్నికలకు ముందు జైపూర్ మండలానికి చెందిన 9 మంది సర్పంచులతో పాటు ఒక ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా భీమారం మండలానికి చెందిన జీడ్పీటీసీతో పాటు ఒక ఎంపీటీసీ, పలువురు సర్పంచులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా గతంలో వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో పని చేయడంతో పాటు వివేక్‌తో పాటు ఆయన కుటుంబంతో సన్నిహిత సబంధాలు ఉన్నవారే. శాసనసభ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ ఓటమి చెందడంతో గడ్డం వివేక్ వెంకటస్వామి గెలుపొందడంతో మిగతా వారు కూడా అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు తాజా మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కాంగ్రెస్, బీజేపీల వైపు మొగ్గు చూపుతున్నట్టు ప్రచారం జరగడంతో మండల స్థాయి నాయకులు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధపడుతున్నారు.

స్థానిక నాయకత్వంలో పెరుగుతున్న వ్యతిరేకత

ఇదివరకే కాంగ్రెస్‌లో చేరిన వారు మళ్లీ చేరుతున్నట్లు ప్రకటించుకోవడంతో స్థానిక నాయకత్వంలో వ్యతిరేకత పెరుగుతోంది. ఎమ్మెల్యే గడ్డం వివేక్ నాయకుల చేరిక పట్ల సుముఖంగా ఉన్నప్పటికీ స్థానిక నాయకత్వంలో విభేదాలతో నాయకుల చేరికను వ్యతిరేకిస్తున్నట్లు తెలియవస్తోంది. ఈ క్రమం సయ్యోధ్య కుదిరితే కాంగ్రెస్ లేదంటే బీజేపీలో చేరటానికి సిద్ధంగా ఉన్నట్లు ఉమ్మడి మండలానికి చెందిన పలువురు తాజా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు పేర్కొంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గ్రామాల్లో బలపడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఇచ్చిన ప్రాధాన్యత బీజేపీకి ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉమ్మడి మండలంలో బీఆర్ఎస్‌కు గడ్డుకాలం రాబోంతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఎమ్మెల్యేకు తోడవుతున్న గత అనుబంధాలు

గతంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో ఉన్న అనుబంధం, ఆయన నాయకత్వంలో పని చేసిన అనుభవం కారణంగా కాంగ్రెస్‌లో చేరడానికి మొదటి ప్రాధాన్యతగా భావిస్తున్నామని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన మాజీ సర్పంచులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షునితో పాటు పలువురు డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో నేరుగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమక్షంతో కాంగ్రెస్‌లో చేరి రాబోవు లోకసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపులో భాగస్వాములు కావాలని భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇదే పరిస్థితి ప్రస్తుతం చెన్నూర్ నియోజకవర్గంలో కూడా కన్పిస్తున్నట్లు తెలుస్తుండగా గతంలో ఉన్న సన్నిహిత సంబంధాలను కాదనకుండా అందరిని కలుపుకుని పోవాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి భావిస్తున్నట్లు తెలియవస్తోంది.

పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో జరుగుతున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేది వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులకు 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 294 మంది రెగ్యులర్ విద్యార్థినీ, విద్యార్థులకు గాను సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, ఉర్దూ, హిందీ) పరీక్షకు 9 వేల 273 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్మెంటల్ అధికారులు, సంరక్షకులు (కస్టోడియన్లు), ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని, పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలలో తాగునీరు, మూత్రశాలలు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా సౌకర్యాలు కల్పించడంతో పాటు అత్యవసర సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు.



లక్ష్యాలను సాధించినప్పుడే సమాజంలో గుర్తింపు

● అదనపు కలెక్టర్ రాహుల్



నవతెలంగాణ-తాండూర్

యువత అనుకున్న లక్ష్యాలను సాధించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అడిషనల్ కలెక్టర్ రాహుల్ తెలిపారు. మంగళవారం తాండూర్ మండలంలోని చౌటపల్లి, బోయపల్లి పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతి సౌకర్యాలను పర్యవేక్షించారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు బోయపల్లి గ్రామంలో యువత సొంతగా ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయానికి వెళ్లి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులను, విద్యార్థులను ప్రోత్సహించారు. యువత అనుకున్న లక్ష్యాలను ఏర్పరచుకొని ఆశయ సాధన కోసం కష్టపడాలని సూచించారు కష్టపడి విజయం సాధించిన వారికి సంఘంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు నిరుద్యోగులు సామూహికంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం వల్ల విజయం సులువు అవుతుందని తెలిపారు. క్రమం తప్పని పుస్తక పఠనంతో గ్రూప్ డిస్కషన్ ద్వారా విజయం తప్పక వరిస్తుందన్నారు. చదువుతోపాటు మానసిక శారీరక వ్యాయామాలను అలవర్చుకోవాలని సూచించారు. ద్వారకాపూర్ మొట్టమొదటి పోస్ట్ మాస్టర్ లక్ష్మీనారాయణ ఇంటిలో ఏర్పరచుకున్న గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన విద్యార్థులు విజయాలను సాధిస్తున్నారు. స్వయంగా ఏర్పరచుకున్న గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రభుత్వం తరుపున మీకు సహాయ సౌకర్యాలు అందిస్తామని అక్కడి నిరుద్యోగులకు విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ అంజన్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.

జీవీకే ఫౌండేషన్ వైద్యులతో శిక్షణ తరగతులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

హైదరాబాద్ జీవీకే ఫౌండేషన్ వైద్యులతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా ఆస్పత్రి అడిషనల్ సీఎంఓ డా.ఉష తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 19 నుంచి 22 వరకు ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు నాలుగు రోజులపాటు బెల్లంపల్లి రీజియన్ శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, ఎస్టీపీపీ, డాక్టర్స్, స్టాఫ్‌నర్స్, వార్డ్ బాయ్స్‌కు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ అత్యవసర సమయాలలో రోగికి అందించవలసిన వైద్యం గురించి అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయవాని, ఏఐటీయూసీ నాయకులు అక్బర్ అలీ, ఆంజనేయులు, పిట్ సెక్రటరీ నాగేంద్ర బట్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ జావేద్, ఈఎంఆర్ జీవీకే డాక్టర్ రవి, జీవీకే సంక్షేమ అధికారి జీదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారులు ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలి



నవతెలంగాణ-తాండూర్

అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పని చేయాలని ఎలక్షన్స్ సెక్టోరల్ ఆఫీసర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా 16వ తేది నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు ప్రభుత్వ కార్యాలయాలల్లో పార్టీ నాయకుల ఫోటోలు ప్రభుత్వానికి సంబంధించిన పోస్టర్లను తొలగించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎటువంటి పార్టీ సంబధిత పోస్టర్లు, సామాగ్రి ఉండకూడదని ఆదేశించారు. 72 గంటలలో ప్రయివేట్ ఆస్తులపైన అనుమతి లేకుండా ఎటువంటి రాజకీయ పోస్టర్లు కానీ, రాతలు కానీ ఉండకూడదన్నారు. పోలింగ్ స్టేషన్లలోని వసతులు సౌకర్యాలను గురించి బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పోలింగ్ శాతం ఆటంకాలు ఇతరత్రా విషయాల గురించి చర్చించారు. 85 ఏళ్ల నిండిన వయోవృద్ధులు ఇంటి దగ్గర నుండే ఓటు హక్కు వినియోగించుకొనేల ప్రభుత్వం ఏర్పాట్లను చేసిందన్నారు. అందుకుగాను ఏప్రిల్ 15 నాటికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనేలా పోలీసు శాఖ శాంతిభద్రతలను పరిరక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ కుమారస్వామి ఎంపీడీఓ శ్రీనివాస్ వ్యవసాయ అధికారి కిరణ్మయి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీఓ సత్యనారాయణ, ఆర్ఐ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-నస్పూర్

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ మంచిర్యాల పోలీస్‌స్టేషన్ పక్కన పెట్రోల్ బంకులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు, అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెట్రోల్ ఫిల్లింగ్-15, ఎయిర్ ఫిల్లింగ్-02, స్కావెంజర్స్-01 కొరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను మంచిర్యాల పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న నూతన పెట్రోల్ పంపులో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు ఆర్మ్డ్ రిజర్వ్డ్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ 9652225673 నెంబర్‌ను సంప్రదించలన్నారు.


నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిన ఆర్కే-5 గని



నవతెలంగాణ-నస్పూర్

2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాన్ని ఆర్కే-5 గని 11 రోజుల ముందుగానే 100 శాతం ఉత్పత్తిని సాధించింది. మార్చి 31 వరకు సాధించాల్సిన 2 లక్షల 70 టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని ఉద్యోగులు ముందుగానే పూర్తి చేశారు. ఉత్పత్తి లక్ష్య సాధనలో వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లో సింగరేణిలో టాప్‌గా నిలుస్తూ హ్యాట్రిక్ టార్గెట్ సాధించింది.100 శాతం ఉత్పత్తి సాధించటమే కాక మెరుగైన ఓఎంఎస్ శాతం సాధించింది. ఒక్క ఉత్పత్తిలో నే కాదు గత కొద్ది రోజులుగా రక్షణ, స్వచ్ఛ పక్వాడ, కోల్ ఇండియా క్రీడలు, వ్యాస రచన పోటీలు, షార్ట్ ఫిల్మ్, ఇలా అన్నింటా ఆర్కే-5 గని సింగరేణిలో ప్రత్యేకత చాటుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 3 సీరియస్ ఆక్సిడెంట్‌లు నమోదు కాగా ఈ ఆర్థిక సంవత్సరం 2023-24లో కేవలం ఒకే ఒక సీరియస్ ఆక్సిడెంట్‌తో మెరుగైన ఓఎంఎస్ సాధనలో ఉద్యోగుల కృషి అభినందనీయం. ప్రస్తుతం పని ప్రదేశాలు థిన్ సీముల్లో ఉత్పత్తికి ప్రతికూలంగా ఉన్నా నిర్ణీత గడువు కంటే ముందే ఉత్పత్తి లక్ష్యం సాధించటంలో నిబద్ధత చాటుతూ సింగరేణి వ్యాప్తంగా ఆర్కే-5 గని ఉద్యోగులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

వడ్డీపై 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

వన్ టైం సెటిల్మెంట్స్ ప్రకారం ఇంటి పన్ను పాత బకాయిలు ఉన్నవారు వడ్డీపై 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకొని, 10 శాతం వడ్డీ తోని బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సతీష్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని15, 20వ వార్డుల్లో కమిషనర్ ఇంటి పన్ను వసూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 శాతం వడ్డీతోనే బకాయిలు చెల్లించవచ్చని, ఈ అవకాశం మార్చి 31 వరకు మాత్రమే ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకొని ఇంటి పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సతీష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com

పది పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జుమ్మెరత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రంలో మంచినీరు, అత్యసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్షల నిర్వహణలో కాపీయింగ్ జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలని భద్రతా సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్, ప్రింటింగ్ దుకాణాలను మూసివేయాలన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు..నగదు పట్టివేత

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల అమ్మాగార్డెన్‌కు చెందిన ఇప్పనపల్లి శ్రీధర్ వద్ద ఆధారాలు లేకుండా రూ.1,50,000, ఆసిఫాబాద్‌కు చెందిన లెక్చరర్ చౌదరి సోమయ్య వద్ద రూ.1,20,000 నగదు తీసుకువెళ్తుండగా పట్టుకున్నారు. మొత్తం రూ.2.70 లక్షలను పోలీసులు సీజ్ చేశామని సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.1.90 పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

మండల పరిధిలోని టోల్‌ప్రాజా వద్ద వాహనాలు తనిఖీలో భాగంగా పోలీసులు రూ.లక్ష90 వేలను పట్టుకున్నారు. మంగళవారం ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.1.11 లక్షలు, మరో ద్విచక్ర వాహనంలో తనిఖీ చేయగా రూ.78,400 నగదు పట్టుకున్నారు. వాంకిడి ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం..వాంకిడి నుండి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా రూ.1.90 లక్షల నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్టు తెలిపారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే దానికి సంబంధించి ఆధారలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

ఫోక్సో కేసులో జీవితకాల జైలు శిక్ష

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని భట్టుపల్లి పంచాయతీ సిబాబు కాలనీలో కొన్ని నెలల క్రితం మైనర్ బాలికపై దురుసుగా ప్రవర్తించిన ఫోక్సో కేసులో నిందితుడికి సెషన్స్ కోర్టు జిల్లా జడ్జి ఎంవీ రమేష్ జీవితకాలం కఠిన కారగార జైలు శిక్ష, రూ. పది వేలు జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. బాలికపై దురుసుగా ప్రవర్తించిన పైలి రమేష్(54)పై పోలీసులు ఫోక్స్ కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. మంగళవారం కేసు విచారణ పూర్తి కాగా నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారైందని తెలిపారు. అత్యంత తొందరగా సాక్షాలు ప్రవేశపెట్టిన పీపీ జీవీ ప్రసాద్, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై ఏ.సోనియా, డీఎస్పీ కరుణాకర్, లైజనింగ్ ఆఫీసర్ డి.సాగర్, సీడీఓ బాబాజీలను ఎస్పీ సురేష్ కుమార్ అభినందించారు.

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని డెయిలీ క్రికెట్ టీం ఆధ్వర్యంలో టోర్నమెంటు నిర్వహిస్తున్న సందర్భంగా మాలీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ యువ నాయకుడు సెండె వాసుదేవ్ ఆధ్వర్యంలో మంగళవారం క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, శారీరకంగా దృఢంగా ఉండడానికి క్రీడలు దోహదపడుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు క్రీడలతో పాటు విద్య, అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన విద్యార్థి జేఏసీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు మంగళవారం కలిశారు. ఈ మేరకు విద్యారంగ సంస్థలపై వినతిపత్రం అందజేశారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ మహిళ వార్డెన్‌లను నియమించాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.

ఎన్నికల నిర్వహణ, నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్
- నెలవారి నేర సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పార్లమెంటు ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించాలని, అదే సమయంలో పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉంటూ, సజావుగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమ మద్యం, పరిమితికి మించిన డబ్బు అక్రమ రవాణాకు పూర్తి అడ్డుకట్ట వేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరు కృతనిశ్చయంతో, 24 గంటలు అప్రమత్తతతో విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలలో మనోధైర్యాన్ని నింపేలా ప్రతిరోజు పెట్రోలింగ్, ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్ స్పాట్‌లను ఏర్పాటు చేసి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రైమ్ మ్యాపింగ్ తయారు చేసి అక్కడ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న పోలీస్ అధికారులు

ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసు అధికారులకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. వారిలో రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఆసిఫాబాద్ సిఐ సతీష్, కాగజ్‌నగర్ టౌన్ సిఐ శంకరయ్య, రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్, ఆసిఫాబాద్ ఎస్సై మహేందర్, హెడ్ కానిస్టేబుల్ బాపురావు, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, ఉమేష్ ఉన్నారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ డిఎస్‌పి సదయ్య, కాగజ్‌నగర్ డిఎస్‌పి కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ రమేశ్, డిపిఓ ఎఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్, పాలకవర్గ సభ్యులపై కేసు నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ శంకరయ్య తెలిపారు. పట్టణంలో ఎస్పీఎం యాజమాన్యం నిర్మించిన గోడలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తొలగించారని యాజమాన్య ప్రతినిధులు చేసిన ఫిర్యాదు మేరకు కమిషనర్ అంజయ్య, లారీ అసోషియేషన్ అధ్యక్షులు కిషోర్‌బాబుతో పాటు పలువురు కౌన్సిలర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

ఎస్పీఎం ప్రతినిధులపై మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు

కాగా మిల్లు ప్రతినిధులపై మున్సిపల్ కమిషనర్ అంజయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిల్లు ప్రతినిధులు ఎస్‌కె మిశ్రా, గిరి, రమేష్‌రావు, సతీష్‌సింగ్‌లు తన విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా తనను కులం పేరుతో దూషించారంటూ టౌన్ సీఐ శంకరయ్యకు ఆయన ఫిర్యాదు చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నార్నూర్ : గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎనిమిది గ్రామాలకు సంబంధించిన 29 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు చేసి రక్తహీనతతో ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్స్ వేయించారు. వైద్య శిబిరంలో సీహెచ్‌ఓ లక్ష్మి, హెచ్‌ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సత్తవ్వ, వైద్య సిబ్బంది జంగుబాయి, కవిత, సారిక, ఆశాలు జ్యోతి, గుంపాబాయి, నిర్మల బాయి, చిన్నుతాయి ఉన్నారు.

పెరిగిన వేరుశనగ సాగు విస్తీర్ణం

- దిగుబడిపై రైతుల ఆశలు



వేరుశనగ పంట

నవతెలంగాణ-తాంసి

మండలంలో వేరుశనగ సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుత వాతావరణం సాగుకు అనుకూలంగా ఉంది. దిగుబడిపై రైతులు కోటి ఆశలతో ఉన్నారు. యాసంగి పంట సాగులో భాగంగా రైతులు వేరుశనగ సాగుపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రెండో పంట సాగులో భాగంగా గత రెండు మూడు సంవత్సరాలు జొన్న పంట సాగు చేశారు. ఈ సంవత్సరం మాత్రం వేరుశనగ పంటను సాగు చేయటానికి రైతులు ఆసక్తి చూపారు. గత రెండు మూడు సంవత్సరాల కింద వేరుశనగ సాగు చేసినప్పటికీ దిగుబడి రాకపోవడం గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ కారణంతోనే వేరుశనగ సాగును తగ్గించారు. గత ఏడాది నుంచి దిగుబడి పెరగడంతో పాటు మార్కెట్‌లో సైతం మంచి డిమాండ్ ఉండటం ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం తాంసి, భీంపూర్ మండల వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారుల సర్వే ప్రకారం పలు గ్రామాల్లో దాదాపు 600 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు ఉంది. ప్రధానంగా తాంసి మండలంలోని కప్పర్ల, వడ్డాడి, పొన్నారి, గ్రామాల్లో సాగు అధికంగా ఉంది. భీంపూర్ మండలంలోని అంతర్గాం, గోముత్రి, వడూర్, ధనోర, గోన, గ్రామాల్లో సాగు చేస్తున్నారు. ఈ యేడాది డిమాండ్ అధికంగా ఉండటంతో పాటు వాతావరణం అనుకూలించడం జరిగింది. ఏడాది కూడా అదే డిమాండ్ ఉంటుందని నమ్మకంతో తెగుళ్ల సోకకుండా రైతులు జాగ్రత్తపడి ఎరువులు, పురుగుమందులు పిచికారి చేస్తున్నారు. మార్కెట్‌లో వేరుశనగకు మంచి డిమాండు పలుకుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడులపై రైతుల కోటి ఆశలు...

వేరుశనగ పండించే రైతులు గత మూడు సంవత్సరాలుగా గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు దిగుబడులు రాక నిరాశలో ఉన్నారు. ఈ సంవత్సరం వేరుశనగకు డిమాండ్ పెరగడంతో రైతులు వేరుశనగ పంటలు వేసేందుకు ఆసక్తి పెంచుకున్నారు. ఈ యేడాది మండలంలో సుమారు ఆరు వందల ఎకరాల్లో వేరుశనగ పంటలను రైతులు వేసినట్టు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు రైతులకు అధిక దిగుబడులు సాధించేందుకు, రైతులకు అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం

మండల వ్యవసాయాధికారి రవీందర్, తాంసి



రైతులకు పంటల దిగుబడులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తున్నారం. ప్రస్తుతం రైతులు రబీలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వేరుశనగ పంటకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో పంట దిగుబడులకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్నాం.

నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట వేశాను

కాడె పోతన్న,రైతు, వడ్డాడి



పది సంవత్సరాలుగా నాకున్న నాలుగెకరాల్లో కూరగాయలతో పాటు వేరుశనగ పంటను వేశాను. వేరుశనగ ఆశించినంత దిగుబడి రాకపోవడంతో పాటు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోయాను. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ఈ సంవత్సరం నాలుగు ఎకరాల్లో వేరుశనగ వేశాను. పంట ఇప్పుడు బాగానే ఉంది.

విద్యార్థి మృతికి కారణమైన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని వహీదా(18) మృతికి కారణమైన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం అడిషనల్ కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సోమవారం విద్యార్థిని తలనొప్పిగా ఉందని ప్రిన్సిపాల్‌కు చెప్పిన కూడా పట్టించుకోలేదని, విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైన తర్వాత హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయిందని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవ్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-తాండూర్

అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పోలీస్ బలగాలచే పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని కలెక్టర్ బాధావత్ సంతోష్ సూచించారు. మంగళవారం మండలంలోని రేపల్లెవాడ అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు భద్రతను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలు రవాణా కాకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. ఎన్నికల దృశ్య ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ముఠాలు చీకటి వ్యాపారం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు రవాణా చేస్తే సీజ్ చేయాలని సూచించారు. బ్యాంకు విత్ డ్రా ఓచర్ లేదా సంబంధిత నిజ ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. నగలకు సంబంధించి ఆర్డర్ కాపీలు వెంట ఉంచుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిగా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో గ్రూపు తగాదాలు జరగకుండా పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు. ఆయనతో అదనపు కలెక్టర్ రోహిత్, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ అంజన్ కుమార్ ఉన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాతరాజు దుర్గాప్రసాద్

నవతెలంగాణ-మందమర్రి



సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అది సాధ్యమవుతుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాతరాజు దుర్గ ప్రసాద్ అన్నారు. మంగళవారం వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల, సఖి ఆధ్వర్యంలో శ్రీపతినగర్‌లో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చాలా శక్తి మంతులని సమాజ గమనాన్ని మార్చే శక్తి వారికి మాత్రమే ఉంటుందని అన్నారు. మహిళలు శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తారని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం ద్వారా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్క శిక్షకురాలు కనీసం చదువురాని ఐదుగురు వయోజనులకు అక్షరాలు నేర్పించాలని సూచించారు. విద్యకు వయసుతో సంబంధం లేదని సులభ పద్ధతిలో చదువు చెప్పాలన్నారు. వయోజనులకు విద్య నేర్పడం ద్వారా వారి మనసుల్లో నిలిచిపోతారని అన్నారు. జ్ఞానాన్ని ఇతరులకు పంచితే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ కొండపల్లి అశోక్ రావు, కోఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, ట్రైనర్ యు శారద, ఉప్పులేటి నరేశ్, రామసాని శేఖర్ పాల్గొన్నారు.

కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం మండల తహసీల్దార్ సి రాజ మనోహర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీకి పాల్పడకుండా, ప్రశాంత వాతావరణంలో, పరీక్షలు రాయాలన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం నిర్వహించిన పరీక్షలో, మొత్తం మూడు సెంటర్లలో 616 మంది విద్యార్థులు పరీక్షలు రాసేది ఉంటే, 615 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఒకరు గైరాజరయ్యారని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు.

సిరికొండలో భారీ వర్షం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు పడి పోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని లక్కంపూర్ గ్రామంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలు ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. పలు ఇండ్లలో నీళ్లు చేరాయి.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ మండలంలోని అంకోలి గ్రామంలో వడగండ్ల వానతో జొన్న పంటలు నేలకొరిగాయి. ఏపుగా పెరిగి చేతికందే దశలో ఉన్న జొన్న పంట నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఎక్కంటి దత్తు, పూదరి శేఖర్, లచ్చన్న, అంగ పోశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. తంతోలి, అంకోలి, కచ్‌కంటి, బూర్నూర్ గ్రామాల్లోనూ వడగండ్ల వాన కురిసింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి.

కౌటాల : మండలంలో మంగళవారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. దీంతో చెట్లు నేలకొరిగాయి. మండలంలోని ముత్తంపేట ప్రధాన రహదారిపై గుంతల్లో నీరు నిండింది. చిన్న వర్షానికే ప్రధాన రహదారిపై నీరు నిల్వడంతో వర్షాకాలంలో ఎలా ఉంటుందోనని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయాలని కోరుతున్నారు.



సిరికొండలో గాలివానకు ఎగిరిపోయిన రేకులు



సిరికొండలో ఈదురుగాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు



ఆదిలాబాద్ రూరల్ మండలంలో వడగళ్ల వాన



ఆదిలాబాద్ రూరల్ మండలంలో వంగిన ట్రాన్స్‌ఫార్మర్



సిరికొండలో దెబ్బతిన్న జొన్న పంట

